క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పారిశుధ్య కార్మికుల నిరసన

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గేటు ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు బుగత ఆశోక్ మాట్లాడుతూ, ప్రతి నెలా ఐదో తేదీ నాటికి జీతాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, సన్యాసమ్మ, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్‌డీ సురేష్

భోగాపురం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈఓపీఆర్‌డీ సురేష్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని నందిగాం సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వలంటీర్లు తప్పనిసరిగా వారంలో మూడు సార్లు సచివాలయానికి వచ్చి హాజరు వేసుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పూసపాటిరేగ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొప్పెర్ల గురుకుల కళాశాల, పూసపాటిరేగ సూర్యోదయ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి.


చిన్నారుల సంఖ్య పెరగాలి



అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

గజపతినగరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట-1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులు నలుగురే ఉండటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. చిన్నారుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ కేంద్రాన్ని సమీపంలోని మరో కేంద్రంలో విలీనం చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

280 మందికి వైద్యసేవలు



మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ లిమిటెడ్ కార్మాగారం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 280 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు సన్యాసిరావు, శంకరరావు తెలిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో క్షయ వ్యాధి నివారణ ర్యాలీ బుధవారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నివారణపై టీబీ సూపర్‌వైజర్ ఎ.వీరాస్వామి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, కఫం ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సురేష్, గుర్ల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా..

ముందస్తు ప్రణాళికలు

- చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మండలాల్లో ప్రతి సోమవారం స్పందన నిర్వహించాలి
- ఆదర్శ పంచాయతీగా నందిగాం: వెబెక్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ సూర్యకుమారి



వెబెక్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఉగాది పండగ తర్వాత వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన వెంటనే క్రాష్‌ప్రోగ్రాం ప్రారంభించి 48 గంటల్లో బోరు బావులకు, పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలని, అందుకోసం యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్‌ను ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి సచివాలయం, ఆర్‌బీకే వద్ద శుద్ధమైన నీటిని ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పశువులు, పక్షులకు కూడా నీరు అందేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల హాజరు, తదితర అంశాలపై అన్ని మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వెబెక్స్ ద్వారా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వారు ఎండ తీవ్రతకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 22న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జిల్లా అంతటా ప్రపంచ జల దినోత్సవం జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా నీటి ప్రాధాన్యత, జల సంరక్షణ, నీటిని తిరిగి వినియోగించడంపై అవగాహన కల్పించాలని చెప్పారు. బోరుబావుల వద్ద నీరు ఇంకేలా గ్రౌండ్ వాటర్ శాఖాధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సచివాలయ సిబ్బంది హాజరుపై సమీక్షిస్తూ కొంత మంది సిబ్బంది హాజరు తక్కువగా ఉండడంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటేషన్‌పై వేరేచోట పనిచేస్తున్న వారికీ ఓడీ మార్క్ చేయాలని, సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. వలంటీర్లు కూడా హాజరు వేసుకోవాలని.. హాజరు తక్కువగా ఉన్నవారిని తొలగించాలన్నారు. సిబ్బంది హాజరును ఎంపీడీఓలు స్వయంగా మానిటర్ చేయాలని సూచించారు. ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కేస్ట్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికీ ఎలాంటి పెండింగ్ లేకుండా జారీ చేయాలని ఆదేశించారు. పది, ఇంటర్ విద్యార్థులకు కేస్ట్ సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయకపోతే తదుపరి అడ్మిషన్స్‌లో ఇబ్బంది పడతారన్న విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రాపౌట్స్‌ను గుర్తించాలని అన్నారు.

నందిగాం పంచాయతీకి గుర్తింపు...

భోగాపురం మండలం నందిగాం పంచాయతీ జాతీయ స్థాయిలో ఆదర్శ పంచాయితీగా నిలిచినందుకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్క అధికారీ స్వయంగా ఆ గ్రామాన్ని సందర్శించి అక్కడి అభివృద్ధిని చూసి తమ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా నిలపడంలో ఆ గ్రామ సర్పంచ్ కీలకంగా వ్యవహరించారని, సొంత ఖర్చుతో నార సంచులు తయారు చేయించి అందరికీ అందించారని చెప్పారు. వెబెక్స్ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, ఆర్‌డబ్లూస్ ఎస్ఈ ఉమాశంకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములనాయుడు, పబ్లిక్ హెల్త్ ఈఈ, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: వేసవి నేపథ్యంలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్న వేతనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్ సూచించారు. గుడివాడ సమీపంలో వెలమ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు, పని ప్రదేశం వద్ద సౌకర్యాలను పరిశీలించారు. పని ప్రదేశం వద్ద నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి, చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై గ్రీన్‌అంబాసిడర్లకు సలహాలు సూచనలు అందించారు. దబ్బిరాజుపేటలో ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించారు.

కుక్కల దాడిలో బాలునికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయసూర్య

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని చిన్నవీధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు కోలా జయసూర్యపై కుక్కలు బుధవారం దాడి చేసి గాయపర్చాయి. బాలునిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో గట్టిగా కేకలు వేశాడు. దీంతో స్థానికులు వాటిని చెదరగొట్టడంతో బాలుడుని వదిలి వెళ్లిపోయాయి. చేతికి తీవ్ర గాయమైన బాలుడిని కుటుంబ సభ్యులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సనందించారు. ఇటీవల మున్సిపాల్టీలో కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా కుక్కలు విహరిస్తుండడంతో చిన్నారులు ఆటలాడుకునే సమయంలో ఏం ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రణాళికతో చదివితే విజయం మీదే..

- జిల్లా గర్ల్‌చైల్డ్ అభివృద్ధి అధికారి మాలతి



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న జిల్లా గర్ల్ చైల్డ్ అభివృద్ధి అధికారి మాలతి

లక్కవరపుకోట: ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు ఎలాంటి భయం, ఆందోళన లేకుండా రాయాలని జిల్లా గర్ల్‌చైల్డ్ అభివృద్ధి అధికారి మాలతి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ బాలికల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థినులకు పెడుతున్న భోజనాలను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రిపరేషన్ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికతో చదివితే మంచి మార్కులు తెచ్చుకోవచ్చన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..జిల్లాలో కేజీబీవీ పాఠశాలల నుంచి 790 మంది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, 788 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. 1052 మంది పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, జామి మండలం కుమరాం కేజీబీవీ పాఠశాలల్లో సూపర్ సిక్స్ బ్యాచ్‌కు చెందిన 120 మంది 10వ తరగతి విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ప్రత్యేకాధికారి ప్రవీణ తదితరులు ఉన్నారు.

ప్రకృతి సోయగం..



జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ రోడ్డు పచ్చని చెట్లు, ఎర్రటి పూలతో ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఆ రోడ్డుగుండా ప్రయాణికులు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

చోడవరం రూట్‌లో సర్వీసులు పెంచండి



ప్రయాణికుల ఫోన్‌కాల్స్‌కు సమాధానాలిస్తున్న డీఎం కె.రమేష్

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రయాణికుల ఫోన్‌కాల్స్‌కు డీఎం కె.రమేష్ బదులిచ్చారు. వేపాడ, అలమండ మీదుగా చోడవరం వరకు బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని ఆవాల గోపాలకృష్ణ కోరారు. బస్సుల కొరత కారణంగా సర్వీసులు నడపలేకపోతున్నామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎం సమాధానం చెప్పారు. ధర్మవరం రూట్‌లో రిక్వెస్ట్ స్టాప్‌లు ఎక్కువయ్యాయని, బస్సులు ఆలస్యం అవుతున్నాయని, రూట్లో ఒక స్టేజి పెంచటం వల్ల టికెట్ ధర పెరిగిందని నాగేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ప్రజల కోరిక మేరకు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నందున బస్సులు ఆలస్యం అవుతున్నాయని, స్టేజి తగ్గించటంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎం బదులిచ్చారు. విజయనగరం ధర్మవరం మీదుగా రాత్రి 21.30 గంటలకు ఉన్న సర్వీసును 22 గంటలకు మార్చాలని మరో ప్రయాణికుడు కోరగా.. డీఎం సానుకూలంగా స్పందించారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లలిత

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రతి ఒక్కరూ టిబి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ జి.లలిత అన్నారు. గరివిడిలోని రాధికా వెజిటబుల్ ఆయిల్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లోని బధిర విద్యార్థులకు టీబీ వ్యాధి పట్ల బుధవారం అవగాహన కల్పించారు. టీబీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ పద్ధతులు, చికిత్సా విధానాన్ని వివరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ జి.శ్రీదేవి ఉపాధ్యాయులకు సూచించారు. చినదుంగాడ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్స్‌బుక్స్, వర్కుబుక్స్, టీచర్స్ డైరీ, లెసెన్ ప్లాన్స్, ఎఫ్ఏ-4 పేపర్లు పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద నిర్వహణ, మెనూ అమలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మొక్కజొన్నలో పంటకోత ప్రయోగం

చీపురుపల్లి రూరల్: మొక్కజొన్న పంటను రబీలో సాగు చేయటం వలన ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పోతాయవలస గ్రామంలో సుబుద్ధి సత్యంకు చెందిన మొక్కజొన్న పంటపొలంలో బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5''5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటకోత చేపట్టగా.. 37.150 కిలోల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరానికి 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లు లెక్కించారు. భూసారాన్ని బట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా దిగుబడి వస్తున్నట్లు చెప్పారు. అనంతరం మొక్కజొన్నలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్.రఘునాథ్, వీఏఏ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా భూ సర్వే పూర్తి చేయండి..

- కలెక్టర్ సూర్యకుమారి



రీ సర్వే వివరాలను తహసీల్దార్ ఆదిలక్ష్మిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

డెంకాడ: సమగ్ర భూముల రీసర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి సేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గంట్లాంలో జరుగుతున్న భూముల రీసర్వేను బుధవారం పరిశీలించారు. అవసరమైన సర్వేయర్లను డిప్యూటేషన్‌పై నియమించినందున వారి సేవలు వినియోగించుకుని సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. రెండు బృందాలతో రీసర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి కలెక్టర్ సూర్యకుమారికి వివరించారు. పది గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని, మరో 16 గ్రామాల్లో సర్వే పూర్తికావాల్సి ఉందన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



ఈశ్వర్ కౌశిక్‌ను కలిసిన నాగరాజు

విజయనగరం: క్రీడలు, క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. రేగిడి మండలం ఉణుకూరుకు చెందిన పర్వతారోహకుడు మెరుగుల నాగరాజు జిల్లా కేంద్రంలో ఈశ్వర్‌కౌశిక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌశిక్ మాట్లాడుతూ, నాగరాజు గతంలో ఆఫ్రికా ఖండంలోని టాంజానియలో 5,985 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని కేవలం ఏడు రోజుల్లో అధిరోహించాడన్నారు. అలాగే సిక్కింలో 5,450 మీటర్ల ఎత్తు గల లఖోఖాన్సే పర్వతాన్ని అధిరోహించి, ఆ రాష్ట్ర ప్రభుత్వం బంగారు పతకంతో పాటు ఉత్తమ అధిరోహకుడు, ఉత్తమ మారథాన్ పురస్కారాన్ని కూడా అందుకున్నారన్నారు. ఎవరెస్ట్ అధిరోహణ లక్ష్యంగా చేసుకున్న నాగరాజుకు ఆర్థిక సాయంతో పాటు, అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు



ప్రజలకు మజ్జిగ అందజేస్తున్న డాక్టర్ పద్మలీల, డాక్టర్ అప్పలనాయుడు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఏంజెల్ సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎండవేడిమి ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. చల్లని నీరు, మజ్జిగ, పళ్ల రసాలు, ద్రవప్రదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంతవరకు ఎండలో తిరగకుండా చూసుకోవాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్, ఏంజెల్ సంస్థ అధ్యక్షులు ఎం. ఎస్. శ్రీనివాసరావు, ఆనంద్, మెప్మా ఉద్యోగులు సన్యాసిరావు, సంతోషి, అనురాధ, సుధ, శైలు, తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్సై సన్యాసినాయుడు

చీపురుపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులతో బుధవారం మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. హాల్ టికెట్లు ఉన్న వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతించాలని, కేంద్రం బయట ఎవరూ గుంపుగా ఉండకుండా చూడాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నందున విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు.

నెలివాడలో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బొండపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని నెలివాడ గ్రామంలో బుధవారం డ్రోన్ సర్వే చేపట్టారు. ముందుగా గ్రామంలోని ప్రభుత్వ, జిరాయితీ, గ్రామకంఠం భూములను డ్రోన్ సాయంతో చిత్రీకరించారు. అనంతరం రైతుల సమక్షంలో క్షేత్రస్థాయి సర్వే చేపట్టనున్నారు. సర్వే పూర్తయ్యాక రైతులకు భూహక్కు పట్టాలు అందజేయనున్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ గ్రామ ఉపసర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను బుధవారం మెకానిక్‌లు బాగు చేశారు. సర్పంచ్ గొటివాడ దేవి మరమ్మతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా గ్రామంలో ఎస్సీ కాలనీ, బ్రాహ్మణవీధి, భర్తవానిపాలెంలో పాడైన తాగునీటి బోర్లను బాగు చేయించినట్లు చెప్పారు.

మహబూబ్‌నగర్ వద్ద MACT-కమ్-IVth అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి సమక్షంలో
O.P.No. 546 OF 2019
దిగువ వారి మధ్య:
బుక్కా వెంకటేష్ మరియు మరొకరు ...పిటీషినర్లు
మరియు
మురళీధరన్ వేలాయుధన్ మరియు ఇతరులు ...ప్రతివాదులు
దిగువ వారికి
కె.ఆర్.సురేష్ కుమార్ తండ్రి కె.వి. రామకృష్ణన్, వయసు: మేజర్, బస్ నం. AP35V-8181 యొక్క యజమాని, నివాసం: డోర్ నం.10-2-17, పుచ్చల స్ట్రీట్ దగ్గర, ఓల్డ్ బస్ స్టాండ్ దగ్గర, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ...ప్రతివాది నం.2
ప్రకటన
పైన తెలిపిన పేరు గల పిటీషినర్లు ఒక మోటార్ ప్రమాదంలో తమ తల్లి మరణానికి సంబంధించి నష్టపరిహారానికి క్లెయిమ్ చేయుటకు మీపై పైన తెలిపిన క్లెయిమ్ పిటీషన్ దాఖలు చేసారు మరియు సదరు విషయం గౌరవనీయ న్యాయస్థానం సమక్షం మీ హాజరు కోసం 31.03.2023న ఉ.10.30 గం.లకు వాయిదా వేయబడింది. అందువలన దాని నుండి లేవనెత్తబడే అన్ని ప్రశ్నలు మరియు అంశాలకు జవాబు చెప్పేందుకు స్వయంగా లేదా కౌన్సిల్ ద్వారా సదరు తేదీ మరియు సమయాన సదరు న్యాయస్థానంలో హాజరు కావలసిందిగా మీరు ఇందుమూలంగా ఆదేశించబడుతున్నారు. లేనట్లయితే, సదరు విషయం మీ గైర్హాజరీలో ఏకపక్షీయంగా నిర్ణయించబడుతుంది.
//ఈ న్యాయస్థానం ఉత్తర్వు మేరకు//
సం/- ఎ.శ్రీనివాస చారి, B.Com., LL.B.
అడ్వకేట్
ఇ.నం.1-7-94/17,
వివేకానందనగర్, మహబూబ్‌నగర్